క్రేన్ కథల పోటీలో
ద్వితీయ బహుమతి
పొందిన కథ

# చోటుందా నాన్నా?



**- కోనే నాగ వెంకట ఆంజనేయులు.**

రైలు ఆగినప్పుడైన కుదుపుకు ఉలిక్కిపడి లేచి కళ్ళు తెరిచి చూశాను. రైలు ఏదో స్టేషన్‌లో ఆగి ఉంది. చీకట్లు అప్పుడే విచ్చుకుంటున్నాయి. స్టేషన్‌లో అప్పటి వరకూ వెలుగులు విరజిమ్మిన విద్యుద్దీపాలు- పరచుకుంటున్న పగటి వెలుతురులో వెలవెల పోతున్నాయి.

రైలు ఎక్కుతున్న వాళ్ళ హడావిడితోనూ, రైలు కదిలే ముందే దిగిపోవాలని ఆత్ర పడుతున్న వాళ్ళతోనూ, చిరుతిళ్ళు, కాఫీ టిఫిన్లు అమ్ముకునే వాళ్ళ కేకలతోనూ ప్లాట్‌ఫారం సందడి సందడిగా వుంది.

మేమున్నది రిజర్వ్‌డ్ బోగీ కావడంతో కాఫీ, టీలు అమ్ముకునే వాళ్ళే తప్ప ప్రయాణీకులెవరూ ఎక్కడంలేదు. ఆ వింగ్‌లో మేము తప్ప మిగిలిన వాళ్ళందరూ ఉత్తరాది వాళ్ళే. మేము యిద్దరం వయసు మళ్ళిన వాళ్ళమే కావడంతోనూ, ఉత్తరాది వాళ్ళం కాకపోవడం చేతనూ నిన్న మేము రైలు ఎక్కినప్పటి నుండీ ఎవరూ మమ్మల్ని పలకరించి పరిచయం చేసుకోలేదు. భాషా సమస్య కారణంగా నేనూ ఎవరితోనూ మాట్లాడలేకపోయాను.

ఇతర దేశస్థులకీ, మన దేశస్థులకీ ఉన్న తేడా అదే. ఇతర దేశాల్లోనైతే దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే భాష మాట్లాడతారు కనుక అపరిచితులు కూడా త్వరగా కలిసిపోగలరు. మనకు రకరకాల భాషలుండడంతో అంత త్వరగా కలవలేరు భాష సమస్య కావడంతో.

నేను, సీత ఉన్నది సైడ్ బెర్త్‌లో. ఇద్దరం దగ్గర దగ్గరగా కిటికీ వద్దనే కూర్చోవచ్చుననే ఉద్దేశ్యంతోనే సైడ్ క్రింద బెర్తు, పై బెర్తు రిజర్వ్ చేయించేను. కిటికీ దగ్గర కూర్చుంటే కొత్త కొత్త ప్రదేశాలు చూస్తూ కాలం యిట్టే గడిపేయవచ్చునన్న నా నమ్మకం వమ్ముకాలేదు. కొత్త కొత్త ప్రదేశాలు చూస్తుండడంతో టైము చాలా వేగంగా గడిచిపోయినట్లనిపించింది. నిన్నంతా పేర్లు మాత్రమే తెలిసిన ఊర్లను ప్రత్యక్షంగా చూస్తున్నందుకు ఏదో తెలియని వింత అనుభూతి.

రైలు ఆగిన కుదుపుకు నాకు మెలకువ వచ్చినా సీతకు మాత్రం మెలకువ రాలేదు. ఆదమరిచి నిద్రపోతూనే వుంది. పాపం! ఈ ప్రయాణంలోనే తనకు కాస్త విశ్రాంతి దొరికింది. ఇంటి దగ్గరైతే రోజంతా నాకు వేళకు కాఫీ, టిఫిన్లు, భోజనాలు, మందులు, స్నానానికి వేడినీళ్ళు ఏర్పాటు చేయడం లాంటి సేవలతోనే గడిచిపోతుంది తనకు. యిక విశ్రాంతి ఎక్కడ? రాత్రి కంపార్ట్‌మెంట్‌లో అందరూ నిద్రపోయిన చాలా సేపటి వరకూ బయటి చీకట్లో నక్షత్రాల వెలుగులు చూస్తూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటూ గడిపేము.

పన్నెండు గంటలు దాటిన తరువాత సీతకు నిద్ర ముంచుకు వస్తుండడం గమనించి నేను పై బెర్తు ఎక్కి పడుకున్నాను. ఉదయం అయిదు గంటలకు నేను క్రిందికి దిగి వచ్చినా- తను యింకా గాఢంగా నిద్రపోతూనే వుండడంతో తనకు మెలకువ రాకుండా తన కాళ్ళదగ్గర సర్దుకుని కూర్చుని కునికిపాట్లు పడుతూ- స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు నిద్రలేచేను. సీత యింకా నిద్ర పోతూనే వుంది.

ఆదమరిచి నిద్రపోతున్న ఆ ముఖంలో అలసట, బాధావీచికలు స్పష్టంగా గోచరమవుతూనే వున్నాయి. వెండితీగెల్లాంటి వెంట్రుకలు- ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణాలు పడి బంగారు తీగెల్లా మార్పు చెందుతున్నాయి.

చిన్నగా తన పాదాలను తట్టేను. నాలుగైదుసార్లు తట్టిన తరువాత కళ్ళు తెరిచి చూసింది ప్రశ్నార్థకంగా. ఒక్క క్షణం తనెక్కడున్నదీ గ్రహించలేక పోయినా మరుక్షణంలో గ్రహించింది మేము రైల్లో ప్రయాణిస్తున్న విషయం.

తెల్లారిపోయి చాలా సేపయింది. లేచి ముఖం కడుక్కో

కాఫీ త్రాగుదాం" అన్నాను ఆప్యాయంగా తన చేతులు నా చేతుల్లోకి తీసుకుంటూ.

కాసేపు బద్దకం తీర్చుకుని లేచి కూర్చుంది సీత. అయినా యింకా మత్తు వదిలినట్లు లేదు. ఆవలిస్తోంది.

"సరే నువ్వు కూర్చో! ఈలోగా నేను ముఖం కడుక్కుని వస్తాను" అంటూ లేచి సంచీలోంచి పళ్ళపొడి, నాలుకబద్దా తీసుకుని బాత్‌రూం వైపు నడిచేను. నేను వచ్చిన తరువాత తను వెళ్ళింది బాత్‌రూంకి. సబ్బుతో ముఖం కూడా కడుక్కుని నీటుగా తలదువ్వుకుని వచ్చింది.

తనెప్పుడూ అంతే! ఉన్నంతలోనే ఎప్పుడూ శుభ్రంగా తయారవుతుంది. నేను బద్ధకించినా కోప్పడి - తానే నా ముఖానికి యింత పౌడరు రాసి దువ్వెనతో వున్న నాలుగు వెంట్రుకలు నీటుగా దువ్వుతుంది.

బండి గమ్యంవైపు పరుగులు పెడుతోంది కాలంతో పోటీ పడుతూ.

కిటికీలోంచి ఉదయపు అందాలు ఆస్వాదిస్తూ కబుర్లాడుకుంటున్నాం. పచ్చని పొలాలు రెపరెపలాడుతూ కనువిందుచేస్తున్నాయి.

మా తెలుగు తనకు అర్థం కాకపోయినా మా సంభాషణను శ్రద్ధగా వింటున్నాడో నార్త్ ఇండియన్ ప్రయాణీకుడు.

తరువాత స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చిన కాఫీ వెండర్ దగ్గర పది రూపాయలిచ్చి చెరో కాఫీ కప్పు తీసుకున్నాం. వెచ్చని కాఫీ కడుపులోకి వెళ్ళిన తరువాత శరీరాలకు చురుకుదనం వచ్చినట్లయింది. ఇద్దరికీ అరవై దాటి పోయాయి మరి!

కాఫీ త్రాగి ప్లాస్టిక్ గ్లాసులు కిటికీలోంచి బయటకు విసిరేశాం. కాసేపు నిశ్శబ్దం తరువాత అంది సీత - "తిరిగి వచ్చిన తరువాత ఎక్కడండీ మనం ఉండేది?" అని.

నిట్టూర్చేను. నాకు మాత్రం ఏం తెలుసు?

"నాన్నా! చూస్తున్నావు కదా మా యిల్లు ఎంత చిన్నదో. నేనూ, మీ కోడలూ, యిద్దరు పిల్లలు వుండడమే మహాకష్టంగా వుంది ఈ యింట్లో. ఈ పరిస్థితిలో మరో యిద్దరు మనుషులు యింత చిన్న యింట్లో సర్దుకోవడం ఎంత కష్టమో మీరే ఆలోచించండి. ఒక్కరైతే ఏదో విధంగా సర్దుకోవచ్చుగానీ యిద్దరికి మాత్రం ఈ యింట్లో చోటు చాలదు నాన్నా". మా పుత్రరత్నం నిష్కర్షగా చెప్పినా- చెప్పించింది ఎవరో ఊహించలేనంత చిన్న పిల్లలం కాదు కదా మేము.

"అయినా యిక్కడికి వచ్చి మీరు చేసేదేముంది? ఆ పల్లెలోనే ఎక్కడో ఒకచోట వుంటే నష్టమేమిటి? డబ్బులు పంపిస్తూనే వున్నాను కదా?" యిది కొసరు.

వృద్ధాప్యంలో ఏ తల్లిదండ్రులైనా కోరుకునేది పిల్లల సాంగత్యమేనని వాడు తెలుసుకోవడానికి యింకా చాలా ఏళ్ళు పడుతుంది. వాడు కూడా మా లాగే వృద్ధుడైన తరువాత తెలుస్తుంది కొడుకు దగ్గర మనవలతో గడపడంలో వున్న ఆనందమేమిటో. కానీ వాడు ఆ విషయం తెలుసుకుని పశ్చాత్తాపపడే సమయానికి మేమీలోకంలో వుంటామన్న నమ్మకం ఏమిటి?

నా కొడుకు సురేష్ - మా పల్లెకు మూడు గంటల ప్రయాణ దూరంలో వున్న పట్టణంలో ఏదో ప్రైవేట్ కంపెనీలో చెప్పుకోదగ్గ ఉద్యోగమే చేస్తున్నాడు. మా కోడలి సంగతి చెప్పాలంటే మేము ఎంత ఆప్యాయత కనపరచినా మా పొడ మొదటి నుండీ గిట్టదు ఆమెకు. ఆవిడకు మేము చేసిన ద్రోహమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కాదు. సౌమ్యురాలైన అత్తగారంటే బొత్తిగా పడదు మా కోడలికి. అత్తాకోడళ్ళకు ఏ యుగంలోనూ పడదన్న విషయం తెలిసిన వాళ్ళం కాబట్టి - కారణాల కోసం వెతికి బుర్రపాడుచేసుకోం మేం ఎప్పుడూ.

మనవల మీద ఆపేక్షతో ఎప్పుడైనా ఓ రెండు రోజులు కొడుకు యింటికి వెళ్ళినా ఆ ఉన్న రెండు రోజుల్లోనూ, "నరకం అంటే యిలా వుంటుందన్నమాట" అని మేము అనుకునేలా ప్రవర్తిస్తుందామె.

ఎదురుగా ఏమీ అనకపోయినా-ఏ పిల్లిమీదో, కుక్క మీదో పెట్టి మమ్మల్ని వాటి కంటే హీనంగా చూస్తుంది. ఈ విషయాలేవీ సురేష్‌కి తెలియకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. తెలిసినా వాడు చేసేదేమీ లేదని మాకు తెలుసు. అటువంటి మనిషి - తనకే మాత్రం గిట్టని యిద్దరు మనుషుల్ని శాశ్వతంగా తన యింట్లో ఎలా ఉంచుకోగలదు?

సర్దుకుంటే- మేమిద్దరం ఉన్నా ఆ యిల్లు ఎంతో చక్కగా సరిపోతుంది. వాళ్ళ భార్యాభర్తలకు ప్రత్యేకంగా ఓ పెద్దగది వుంది. పిల్లలిద్దరికీ కలిపి అంతకంటే కొంచెం చిన్నగది వుంది. ఓ హాలు, వంటగది, బాత్‌రూం, టాయిలెట్ వేటికవే విడివిడిగా ఉన్నాయి. పెద్ద గదిలో సగం ఉన్న స్టోర్‌రూంలోని సామాన్లు తీయించి అటక మీద సర్దుకుంటే ఓ మడతమంచం, ఓ చాపా నిక్షేపంగా పడతాయి. మంచం మీద నేను. చాపమీద సీత చక్కగా పడుకోవచ్చు. బట్టలు పెట్టుకోడానికి గోడలోనే చిన్న అలమారాకూడా ఉంది. ఇదే విషయం సురేష్‌తో చెబితే

**కోనే నాగ వెంకట ఆంజనేయులు**



డిసెంబర్22, 1953 లో జన్మించారు. విద్యాభ్యాసాన్ని ఏలూరులో పూర్తి చేశారు. 1975 నుండి విశాఖపట్నం లోఉంటూ.. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ లో అసిస్టెంట్‌మేనజర్ (పర్సనల్)గా పని చేస్తున్నారు. కథకు బహుమతి పొందడం ఇది ఐదోసారి హాస్యాన్ని ఎక్కువగా ఇష్టపడతారు. బాల సాహిత్యం అంటే ప్రాణం. ఇప్పటి వరకు ప్రచురించబడిన కథలసంఖ్య 250పైనే. అందులో ఎక్కువ భాగం హాస్య కథలు, పిల్లల కథలే. కథలే గాక అనేక కవితలు, జోక్స్ రేడియో నాటికలు ప్రచురణకు, ప్రసారానికి నోచుకున్నాయి.

వాడి నోటి నుండి సమాధానం వచ్చేలోగానే వాడివంక మా కోడలు ఎంత సీరియస్‌గా చూసిందంటే ఆ చూపుకి మాకే భయం వేసింది.

స్టోర్‌రూం ఖాళీ చేయించి మాకు యివ్వడం మా కోడలికి బొత్తిగా యిష్టం లేదనే కంటే-స్టోర్ రూం మాకిస్తే మేమింక ఆ యింట్లో నుంచి కదలమేమోనన్న భయం ఎక్కువగా వున్నట్లు తోస్తుంది మాకు.

ఇల్లు మరో యిద్దరికి సరిపోదు. ఒక్కరైతే సరిపెట్టుకోవచ్చునంటే అర్ధమేమిటి? ఒకళ్ళని తన దగ్గర ఉంచుకున్నా రెండో వాళ్ళు వెళ్ళి వుండడానికి మాకు మరో కొడుకు గానీ, కూతురు గానీ లేరే? మరి ఆ రెండోవాళ్ళు ఎక్కడ వుండాలని వాళ్ళ ఉద్దేశ్యం? నాకు అర్థం కాలేదు.

ఒక్కగానొక్క సంతానం మాకు సురేష్. మా నాన్నగారి పేరేపెట్టుకున్నాం- సూర్యారావుని కొద్దిగా మార్చి. ఒక్కడే కొడుకని ఎంత అల్లారు ముద్దుగా పెంచేం వాడిని? వాడేం కోరినా క్షణాల్లో సిద్ధం చేసే వాళ్ళం. నా కంటే వాళ్ళమ్మ దగ్గరే చనువెక్కువ వాడికి. వాళ్ళ అమ్మ కూడా వాడిమీద తక్కువ ప్రేమ చూపించలేదు. వాడికే చిన్న నలత చేసినా నిద్రాహారాలు మాని రాత్రింబగళ్ళు వాడికి సేవలు చేసింది వాళ్ళమ్మే.

పదిహేడేళ్ళ వయసులో వాడికి టైఫాయిడ్ జ్వరం వచ్చి యిరవై రెండు రోజులు హాస్పిటల్‌లో వుంటే - చూసేందుకు నర్సులు ఉన్నా - కళ్ళల్లో ఒత్తులు వేసుకుని వాడిని కనిపెట్టుకుని ఉన్నది వాళ్ళమ్మే. ఏ అర్ధరాత్రో బాత్‌రూంకి వెళ్ళడానికి నేను లేచినప్పుడు కూడా - వాడి మంచం దుప్పటి సరిచేస్తూనో, వాడిని లేపి మందులు వేసి మంచినీళ్ళు త్రాగిస్తూనో కనిపించేది సీత.

అంత సేవ చేసిన తల్లి పట్ల కూడా విశ్వాసం లేదా వాడికి? పెళ్ళాం మాటే వేదమా? పేగు బంధం అంత తేలిగ్గా తెంచేసుకున్నాడా?

ఇక చదువు విషయానికి వస్తే - వాడికిష్టమైన చదువే చదివించేం. ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీటు రాకపోయేసరికి - మా తాహతుకి మించినదే అయినా లక్షలు ఖర్చుపెట్టి ప్రైవేట్ కాలేజీలో చేర్పించి ఇంజనీర్‌ని చేశాం. వాడి చదువు కోసం కాదూ ఉన్న యింటినీ, అరెకరం బంగారం పండే మాగాణినీ అమ్ముకున్నది? యిప్పుడు మాకు నిలువ నీడ లేకుండా చేసుకున్నదీ? యింత చేసిన మాకు - కట్టుకున్న యింట్లో ఆ మాత్రం స్థానం యివ్వవలసిన బాధ్యత లేదా వాడికి?

ఇద్దరికి యిల్లు చాలదు-ఒక్కరికైతే సరిపోతుంది అని వాడు నిష్కర్షగా చెప్పిన రోజైతే సీత కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. ఆ కన్నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వెయ్యడం నాకు సాధ్యం కాలేదు.

ఇన్నేళ్ళు ఎడబాటు లేకుండా కలిసి ఉన్న తల్లిదండ్రుల్ని విడదీయాలనుకుంటున్నాడా? ఒకళ్ళని ఉంచుకుంటే మరొకరం ఎక్కడుంటాము అని ఎన్ని నిద్ర లేని రాత్రులు గడిపిందో నాకు తెలుసు. ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందా అని నాకంటే తనే ఎక్కువగా ఆలోచిస్తున్నది, మదనపడుతున్నది.

ఆ పల్లెటూళ్ళో పదిమంది పిల్లలకు ప్రైవేట్ చెప్పి సంపాదించే ఆ నాలుగైదు వందల రూపాయలు, సురేష్ నెలనెలా పంపించే అయిదు వందల రూపాయలు - మొత్తం వెయ్యి రూపాయలతో నెలంతా గడపడం ఎంతో కష్టంగా వున్నా-తిన్నా తినకపోయినా సర్దుకుపోవడం అలవాటైపోయింది.

"మళ్ళీ ఆలోచనలో పడ్డారా?" సీత పిలుపుతో ఈ లోకంలోకి వచ్చేను. రైలు తన దారినతాను ప్రయాణిస్తూనే వుంది. టైము చూసుకున్నాను. పన్నెండు దాటింది.

"అదే! ఊరు నుండి తిరిగి వచ్చి ఎక్కడుందామండి అని అడిగేవు కదా! ఆ విషయమే ఆలోచిస్తున్నాను. ఏం తోచడంలేదు" చెప్పేను.

"ఎక్కడో ఓచోట ఉందాంలెండి. ఇంత విశాల ప్రపంచంలో మనిద్దరికీ కాస్త చోటు దొరకదా! ఆ విషయం ఆలోచిస్తూ బుర్రపాడుచేసుకుంటున్నారా? యింక చాల్లెండి. చేతులు కడుక్కుని రండి. భోజనం చేద్దాం" అన్నది సీత విషయాన్ని తేలిగ్గా తీసుకుంటూ.

నేను లేచి వెళ్ళి వాష్‌బేసిన్ దగ్గర చేతులు కడుక్కుని వచ్చేసరికి - సీత స్టీలు ప్లేట్లలో - నిన్న యింట్లో తయారుచేసి పట్టుకువచ్చిన పులిహోర సర్దివుంచింది. రైలు ప్రయాణాలకు చక్కని దోస్తీ పులిహోర. తయారుచేసి రెండు రోజులైనా పాడైపోకుండా వుండేది పులిహోర ఒక్కటే. పైగా రెండోరోజు మరింత రుచిగా వుంటుంది కూడా.

పులిహోర తిని చెరొక అరటిపండు తిన్నాం!


"పాపం మీకు పెరుగన్నం లేదీ రోజు", అంటూ నొచ్చుకుంది సీత.

మూడు పూటలా పెరుగుతో రెండు ముద్దలైనా తినకపోతే భోజనం చేసినట్లుండదు నాకు. చిన్నప్పటి నుండీ అదే అలవాటు.

"ఈయనగారి పెరుగుకే రోజూ రెండు పేకెట్ల పాలు ఖర్చైపోతున్నాయి" అని మా కోడలు సణుగుడు విని పెరుగంటేనే ఏహ్యాభావం కలిగింది వాళ్ళింట్లో వున్నన్ని రోజులూ.

"ఒక్కరోజు పెరుగన్నం లేకపోతే కొంపలేం మునిగిపోవులే". కాశీ వెళితే రోజూ మూడు పూటలా పెరుగన్నం తినొచ్చు. కాశీలో షుంచి గడ్డ పెరుగు చవగ్గా దొరుకుతుందని చెప్పేడు కదా సుబ్బయ్య" అన్నాను.

సుబ్బయ్య మా వూళ్ళో మేము బాగా బ్రతికిన రోజుల్లో మా పొలం కౌలు చేసేవాడు. ఇల్లు, పొలం అమ్ముకుని మేము రోడ్డున పడినప్పుడు మా ముగ్గురికీ తన యింట్లో స్థానం కల్పించిన మంచి మనసున్న మనిషి సుబ్బయ్య. అద్దె



కూడా తీసుకోకుండా తన యింట్లోని రెండు గదులు మాకిచ్చేడు. అతని భార్యా, పిల్లలు, తల్లిగారు కూడా మమ్మల్ని ఎంతో ఆదరంగా చూసేవారు. క్రిందటి సంవత్సరం తల్లిపోయినప్పుడు ఆమె అస్థికలు కాశీ తీసుకువెళ్ళి గంగలో కలిపివచ్చేడు సుబ్బయ్య.

'బాబుగారూ! జీవితంలో ప్రతీ ఒక్కరూ ఒక్కసారైనా కాశీ వెళ్ళిరావాలండి. జన్మ ధన్యమైపోతుంది. అంత గొప్ప పట్టణం కాశీ. ప్రశాంతంగా వుండే ఆ గంగమ్మ ఒడ్డున కాసేపు కూర్చున్నా మనసు ఆనందంతో ఉప్పొంగుతుందండి. బాధలన్నిటినీ మరిపించి మనసుకి ప్రశాంతత నిస్తుంది గంగమ్మతల్లి" అంటూ తన్మయత్వంతో చెప్పుకొచ్చేడు సుబ్బయ్య కాశీ విశేషాలు.

అదిగో అప్పుడు కోరిందీ కోరిక సీత.

"మనం కూడా ఒక్కసారి కాశీ వెళ్ళి వద్దామండి. యింకెన్నాళ్ళు బ్రతుకుతామో తెలియని వయసొచ్చేసింది యిద్దరికీ. పోయేలోగానే ఒక్కసారి కాశీ చూసొచ్చేస్తే ఆ తరువాత ఎప్పుడు పోయినా పరవాలేదు" అంది.

కాశీ వెళ్ళి రావాలన్నది నాకు కూడా చిరకాల వాంఛ. కానీ కాశీ వెళ్ళి రావడమన్నది యిప్పుడు మేమున్న పరిస్థితిలో ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అదే చెప్పేను నిస్పృహతో.

"వెనుకాడకండి. యిప్పుడు వెనుకాడితే మనం మళ్ళీ జీవితంలో వెళ్ళలేం కాశీ. డబ్బు గురించి ఆలోచించకండి. యివిగో- యివి అమ్మేయండి" అంటూ తన చేతులకి వున్న రెండు బంగారు గాజులు తీసి నా చేతిలో పెట్టింది.

ఆ గాజులమ్మి ఈ ప్రయాణం పెట్టుకున్నాం. తను జీవితంలో నన్ను కోరిన ఒకే ఒక్క కోరిక- తన ఖర్చుతోనే అయినా తీర్చగలుగు తున్నందుకు ఆనందపడిపోయాను.

నలభై ఏళ్ళు బడిపంతులు ఉద్యోగం చేసినా-వేలాది మంది విద్యార్థుల అభిమాన ధనాన్ని తప్ప యింకేమీ వెనకేసుకోలేకపోయాను.

మా పెళ్ళిలో తన పుట్టింటి వాళ్ళు పెట్టిన గాజులు ఈ విధంగా ఉపయోగపడుతున్నాయి. ఎప్పుడు ఎంత అవసరం వచ్చినా కనీసం తాకట్టు కూడా పెట్టని గాజుల్ని అమ్మివేస్తున్న సమయంలో కళ్ళు ధారాపాతంగా వర్షించడం షాపువాడు వింతగా చూశాడు.

నేను చేయించకపోగా పుట్టింటి వాళ్ళు యిచ్చిన గాజులు అమ్ముకోవలసి వచ్చినందుకు నేను బాధపడుతుంటే తనే నన్ను ఓదార్చింది- 'నాకు లేని బాధ మీ కెందుకండీ" అంటూ.

అసలు ఈ గాజులు కూడా సీతకు దక్కుతాయనుకోలేదు. సురేష్‌కి అమ్మాయి పుట్టినప్పుడు - చంటి దాని బాలసారె నాడు దానికి గొలుసు చేయించలేదని చాలా పేచీ పెట్టింది మా కోడలు. "తాతగారు ఆ మాత్రం చేయించలేరా' అంటూ.

అప్పటికే యిల్లూ, పొలమూ అమ్మేసుకోవడంతో మా ఆర్థిక పరిస్థితి బాగా దిగజారిపోయింది. అయినా సరే ఎన్నో యిబ్బందులు పడి చంటిదానికి గాజులు మాత్రం చేయించగలిగేము.

'గాజులు, గొలుసు ఒక సెట్టు కదా! గొలుసు లేకుండా గాజులేం వెయ్యమంటారు పిల్లకి' అంటూ రాద్ధాంతం చేస్తుంటే - సీత తన చేతి గాజులు తీసి యిచ్చేయడానికి సిద్ధపడింది. అయితే నేనే వారించాను-ఆపద సమయంలో ఆదుకోవడానికి ఆ మాత్రం బంగారం కూడా లేకపోతే ఎలా అని.

తనకు యిష్టం లేకపోయినా నా మాట మన్నించింది సీత - నాభార్య. ఆ గాజులైనా ఉండబట్టే ఈనాడు యిలా కాశీ వెళ్ళగలుగుతున్నాము.

ఎంత కష్టసమయంలో కూడా నా వెన్నంటి ఉండి - మీకు నేనున్నాను నిరాశపడకండి అంటూ ఎన్నో సందర్భాల్లో నాకు తోడునీడగా వున్న సీతపై నాకున్న అనురాగం ఒక్క భార్యగానే కాదు - చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకుని మాతృప్రేమకు దూరమైన నన్ను లాలించి, ఓదార్చే ఓ తల్లిగా కూడా వుంది.

తన కంటి తడినేను చూడలేను. ఎల్లవేళలా తన పెదవులపై చిరునవ్వు మాత్రమే చూడాలని కోరుకునే ఓ సామాన్యుడైన భర్తను నేను.

అదిగో ఆ గాజుల ప్రహసనం తరువాత నుండి అత్తమామల పొడ మరీ గిట్టడం మానేసింది మా కోడలికి. యింటికి వెళ్ళినా కోడలు ముఖం మాడ్చుకుని మమ్మల్ని ఆదరంగా చూడదని తెలిసినా - మనవలపై మమకారం చంపుకోలేక అప్పుడప్పుడూ వెళ్ళి ఒక రోజో, రెండు రోజులో గడిపి వస్తుంటాము. తల్లి చేరనీయకపోయినా 'తాతయ్యా, నానమ్మా' అంటూ దగ్గర చేరిపోయే మనవలను విడిచి వెళ్ళలేక వెళ్ళలేక తిరిగి వెళుతుంటాము. కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ

కాశీ నుండి తిరిగి సుబ్బయ్య యింటికి వెళ్ళినా - రెండు రోజులో మూడు రోజులో మాత్రమే అక్కడ మేము వుండగలిగేది. తరువాత ఆ యిల్లు ఖాళీ చేసేసి మరో గూడు వెతుక్కోవలసిందే.

సుబ్బయ్య కొడుక్కి పెళ్ళై కోడలు రావడంతో యికపై మేము ఆ యింట్లో వుండగలిగే పరిస్థితి లేదు.

"మరోలా అనుకోకండి పంతులుగారూ! కోడలు వస్తే యిల్లు సరిపోదని మీకు తెలియనిది కాదు" అంటూ నొచ్చుకున్న సుబ్బయ్య భుజం తట్టేను మరేం పరవాలేదన్నట్లుగా.

మరో గత్యంతరం లేక కొడుకు దగ్గరకు వెళ్ళి వుండాలనుకుంటే 'యిదిగో యిలా మరో యిద్దరికి వాళ్ళ యింట్లో చోటు సరిపోదన్న 'నిజం' తెలిసింది.

తరువాతి స్టేషనే కాశీ స్టేషనని తెలిసి సామాను సర్దుకోవడం మొదలుపెట్టాం. బోగీలో అందరూ కూడా సామానులు సర్దుకుని దిగిపోవడానికి సిద్ధమవసాగేరు.

ఎన్నో ఏళ్ళుగా చూడాలని తపించి పోతున్న కాశీపట్టణాన్ని మరి కొద్ది సేపటిలో చూడబోతున్నామన్న ఉద్విగ్నత మాతో పాటు అందరి ముఖాల్లోనూ గమనించేను.

హిందువుల అతి పవిత్రమైన పుణ్యక్షేత్రమూ, అతి

పురాతనమైన నగరమూ అయిన వారణాశి ప్లాట్‌ఫారంపైకి దిగగానే అనిర్వచనీయమైన ఆనందంతో మనసు నిండి పోయింది. దేశం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భారతీయులు పవిత్రమైన ఈ మహానగరాన్ని కన్నులారా చూసి తరించబోతున్నందుకు ఎంత ఉప్పొంగిపోతున్నారో ఆనందంతో కళకళలాడుతున్న వాళ్ళ ముఖాలే చెబుతున్నాయి.

ఓ గుర్రంబండి వాడి సాయంతో గంగ ఒడ్డునే గల ఓ సత్రంలో గది తీసుకున్నాము కిటికీలో నుంచి గంగమ్మ తల్లి పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తున్న దృశ్యం మనోహరంగా కనిపిస్తోంది.

సామాన్లు గదిలో పడేసి చల్లటి గంగ ఒడిలో దిగి స్నానం చేశాము. అమ్మలా ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది గంగమ్మ మా పాపాలన్నీ ప్రక్షాళన చేస్తున్నట్లుగా, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కాశీ విశ్వేశ్వరుణ్ణి, విశాలాక్షి అమ్మవారిని తనివితీరా దర్శించుకున్నాము.

ఉన్న నాలుగురోజుల్లోనూ వీలైనంత ఎక్కువ సమయం గంగాస్నానానికి, భగవద్దర్శనానికీ కేటాయించుకున్నాము. తనివి తీరా అనేక సార్లు గంగలో మునిగి మా పాపాలన్నీ కడిగేసుకున్నాము. ప్రతీ ఘాట్‌లోనూ స్నానం చేశాము.

కాశీలో ఉన్నన్ని రోజులూ మనసులో మరో ఆలోచనకు తావీయకుండా ప్రశాంత చిత్తంతో గడిపేము.

మన తెలుగు వాళ్ళు నడుపుతున్న హోటల్లో మన సాంప్రదాయ భోజనం దొరికింది. దోసకాయ పప్పు, కందిపచ్చడి, రసం, కాకరకాయ వేపుడు, అప్పడాలు, వడియాలతో కాశీలో భోజనం చేయడం మరపురాని అనుభూతి.

పాలతో చేయబడిన రకరకాల మిఠాయిలు తిన్నాము. గడ్డలాంటి మీగడ పెరుగు కరువుతీరా త్రాగేము.

మరణించిన పెద్దలకు చేయవలసిన శ్రాద్ధ కర్మలన్నీ శ్రద్ధగా జరిపించేము.

బోటులో గంగలో షికారు చేసి పరవశించిపోయాము. బోటులో వెళుతూ ఒడ్డున ఉన్న ఘాట్లను చూడడం అనిర్వచనీయమైన, అద్భుతమైన అనుభూతి.

గంగమ్మ తల్లికి యిచ్చే మనోహరమైన హారతిని కన్నుల పండువుగా చూసి తరించేము.

మహాస్మశానంలో కాలుతున్న శవాలు వైరాగ్యాన్ని పెంచుతున్నాయి.

“యిక్కడే చనిపోయే భాగ్యం కలిగితే ఎంత ఆనందంగా ఉంటుందండీ” అంటున్న సీత నోరు మృదువుగా మూసేను.

“అటువంటి మాటలు రానీకు నీనోట”. వారించేను మెత్తగా

కాశీని విడిచే ముందు యిద్దరం ఆఖరిసారిగా గంగలో మునిగేము ఒకరి చేతిని మరొకరం పట్టుకుని మూడుసార్లు.

తిరుగు ప్రయాణం!

రైల్లో కిటికీ దగ్గర కూర్చున్నాను. కళ్ళు శూన్యంలో ఎక్కడో చూస్తున్నాయి. మనసంతా చెప్పలేని దిగులు. ఒంటరి వాడినన్న భావన. ఆపుకోవడానికి వీలులేనంత దుఃఖం.

జలజలా కారుతున్న కన్నీటిని తుడుచుకోవడానికి కూడా ఏ ప్రయత్నమూ చేయాలనిపించడంలేదు. ఎందుకిలా జరిగింది?

ఏం పాపం చేశాను నేను?

చేసినా గంగాస్నానంతో ఆ పాపాలన్నీ ప్రక్షాళన కాలేదా?

నా కెందుకీ శిక్ష వేశాడు కాశీ విశ్వేశ్వరుడు?

ఏమిటి నా భవిష్యత్తు? శేషజీవితం ఎలా గడపడం ఒంటరిగా. ఆఖరిసారి గంగలో నేనూ సీతా మూడోసారి మునక వేసి పైకి లేచేం. అయితే లేచింది నేను ఒక్కడినే.

నా చేతిలో సీత చేయిలేదు. కంగారుగా నీళ్ళలోనే చెయ్యాడించేను. సీత శరీరం తగల్లేదు నా చేతికి.

జరిగింది గ్రహించడానికి కొద్ది నిముషాలు పట్టింది.

దిగ్భ్రాంతుడనయ్యాను.

నా సీత గంగలో మునిగిపోయింది. అనంతమైన గంగా ప్రవాహంలో కొట్టుకుపోయింది.

పిచ్చివాడిలా ఒడ్డునే గడిపేను రాత్రి వరకూ. దుఃఖంతో మనసు కకావికలమైపోయింది.

ఈ మహానగరంలో నాగోడు ఎవరు వినిపించుకుంటారు? ఎవరు సాయం చేస్తారు?

మరునాడు ఉదయం వరకూ అక్కడే వున్నాను- పార్థివ శరీరమైనా ఒడ్డుకు కొట్టుకు వస్తుందేమోనని. నా ఆశ నిరాశ అయింది.

ముప్పై అయిదేళ్ళుగా నా ఆత్మలో ఆత్మగా, ప్రాణంలో ప్రాణంగా, కష్టసుఖాల్లో నాకు తోడు, నీడై నిలిచిన సీత శరీరమైనా నాకు దక్కలేదు.

శవం లేకుండానే ఉత్తర క్రియలన్నీ జరిపించేను.

నా అర్ధాంగిని తనలో దాచుకున్న గంగమ్మ ఒడ్డున ఒక రోజంతా ప్రశాంత చిత్తంతో గడిపేను. ఏదీ మన చేతిలో లేదన్న వైరాగ్యాన్ని ఒంట బట్టించుకుని నా సీతను నా నుండి దూరం చేసిన కాశీ పట్టణాన్ని విడిచి రైల్లో మా వూరికి తిరుగు ప్రయాణమయ్యేను బరువైన మనసుతో

కాశీ నుండి నేను వ్రాసి పోస్ట్ చేసిన ఉత్తరం నా కొడుకు సురేష్‌కి ఈ పాటికి చేరి వుంటుంది. కళ్ళు మూసుకుని సీటులో వెనక్కి వాలేను. ఉత్తరంలోని విషయాలు మననం చేసుకుంటూ.

బాబూ సురేష్,

నీ ఇంటిలో యిద్దరికి చోటు సరిపోదన్నావు. ఒక్కరైతే ఎలాగోలా సర్దుకోవచ్చుననీ నువ్వే అన్నావు. బాబూ మీ అమ్మ కాశీలో గంగమ్మ తల్లిలో ఐక్యమై పోయిందిరా. ఆమె ప్రమాదవశాత్తు నీట మునిగిపోయిందో లేక నీ యింట్లో నాకు చోటు చూపించడానికే యిలా జరిగిందో నీ ఊహకే వదిలేస్తున్నాను. మీ అమ్మకు గంగమ్మ ఒడిలో చోటు దొరికింది. యిప్పుడు నేను ఒక్కడినే. బాబూ యిప్పుడైనా నీ యింట్లో ఈ ఒక్క ఒంటరి మనిషికి చోటు సరిపోతుందా నాన్నా?

నాన్న.

★